క్లుప్తంగా

శివాలయాల్లో విశేష పూజలు



తలకోన సిద్ధేశ్వర స్వామి

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లోని శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. సోమవారం ఆశ్వీయుజ మాసం పురస్కరించుకుని ఆలయాల్లో పూజలు చేపట్టారు. శివాలయాల్లో రుద్రాభిషేకాలు, ప్రత్యేక అభిషేక సేవలు, అర్చనలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి పూజల్లో పాల్గొని దేవున్ని దర్శించుకున్నారు. చిన్నగొట్టిగల్లులోని భీమేశ్వరస్వామికి, తలకోన సిద్ధేశ్వర స్వామి, నెలకోన సిద్ధేశ్వర స్వామి ఆలయాల్లో పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు, ధర్మకర్తలు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

9న తిరుపతిలో విద్యుత్ అదాలత్

తిరుపతి రూరల్: దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎస్పీడీసీఎల్) పరిధిలోని తిరుపతి టౌన్ డివిజన్‌లో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తిరుపతి టౌన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వాసుదేవరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్ పర్సన్ శ్రీనివాసఆంజనేయ మూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. తిరుపతి పట్టణం, పాత తిరుచానూరు రోడ్డులోని అన్నపూర్ణమ్మ ఆలయం సమీపంలో ఉన్న ఎస్పీడీసీఎల్ తిరుపతి టౌన్ డివిజన్ కార్యాలయంలో ఈనెల 9వ తేదీ ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తుడా పనులకు బోర్డులు ఏర్పాటు చేయాలి

భాకరాపేట: మండలంలో తుడా నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలని చిన్నగొట్టిగల్లు ఎంపీడీవో దేవేంద్ర బాబు తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పనికి పని పేరుతో బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. తుడా నిధులతో ప్రతి పంచాయతీలో ప్రతి గ్రామంలోనూ పనులు జరగడం ద్వారా మండలంలో అభివృద్ధి చెందిందన్నారు. త్వరితిగతిన పని పేరుతో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

డిగ్రీ ఫలితాల్లో ఎస్‌డీహెచ్ఆర్ విద్యార్థుల ప్రతిభ

తిరుపతి సిటీ: ఎస్వీయూ విడుదల చేసిన మొదటి సంవత్సరం డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక న్యూ బాలాజీ కాలనీలోని ఎస్‌డీహెచ్ఆర్ కళాశాల విద్యార్థులు 397 మంది డిస్టింక్షన్లు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎ.ఉషా తెలియజేశారు. బీసీసీపీ గ్రూప్ నందు కె.ప్రతిభ 9.33 శాతం, బీసీపీఎల్లో ప్రశాంత్ కుమార్ 9.25, నాగశ్రీ 9.12, లోకేష్ 8.95, ఎంఎస్‌సీఎస్ గ్రూప్‌లో అర్చన 9.11, బీకాంలో జానకి 9.05, బీసీఏ ఎమ్ఎల్ గ్రూప్‌లో శ్రీహరి 9.00, ఎఫ్ఎస్‌టీ గ్రూప్‌లో భావన 8.87, బీబీఏలో గాయత్రీ 8.73, ఎంపీసీఎస్‌లో లక్ష్మీప్రియ 8.57 శాతం సాధించారని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల చైర్మన్ డీవీఎస్ చక్రవర్తిరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

నేడు సీకాం కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

తిరుపతి సిటీ: తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డు న్యూ మారుతీ నగర్‌లోని సీకాం కళాశాల ఆవరణలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సురేంద్రరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

స్పందన అర్జీలకు ప్రాధాన్యం



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో నిషాంత్‌రెడ్డి

తిరుపతి అర్బన్: స్పందనలో వచ్చే అర్జీలకు ప్రాధాన్యం ఇవ్వాలని తిరుపతి ఆర్డీవో నిషాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన స్పందనకు 10 అర్జీలు వచ్చాయి. వాటిని నిశితంగా పరిశీలించిన ఆర్డీవో పరిష్కారం కోసం తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయండి

తిరుపతి సిటీ: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ విశాఖలో జరుగుతున్న నిరసనలకు సంఘీభావంగా వామపక్షాలు, పలు కార్మిక, విద్యార్థి సంఘాలు ఈ నెల 8న రాష్ట్ర బంద్‌కు పిలుపు నిచ్చాయి. ఈ నేపథ్యంలో బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం స్థానిక ఎస్వీయూ పరిపాలనా భవనం నుంచి గాంధీరోడ్డు వరకు వామపక్షాలు, పలు విద్యార్థి సంఘం నేతలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు బండి చలపతి, నవీన్, సుందరరాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు మాధవ్, రవి, అక్బర్, ఏఐవైఎఫ్ రామకృష్ణ, పీడీఎస్‌యూ నాయకులు ఆదిశేషు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో సుందర తిరుమల

- ఆధునిక టెక్నాలజీతో మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ
- టీటీడీ జేఈవో సదా భార్గవి



మెరుగైన పారిశుధ్య విధులు నిర్వహించిన కార్మికురాలిని సత్కరిస్తున్న జేఈవో సదా భార్గవి

తిరుపతి కల్చరల్: ప్రపంచ ప్రఖ్యాత తిరుమలకు లక్షలాది మంది భక్తులు వస్తుంటారని, ఇందు కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరింత మెరుగ్గా పారిశుధ్య చర్యలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని టీటీడీ జేఈవో సదా భార్గవి తెలిపారు. శ్వేత భవనంలో సోమవారం శుద్ధ తిరుమల–సుందర తిరుమల కార్యక్రమంపై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. పర్యావరణ పరిరక్షణ కోసం తిరుమలలో నిరంతరాయంగా శుద్ధ తిరుమల–సుందర తిరుమల కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. తిరుమలతో పాటు తిరుపతిలోని టీటీడీ సంస్థల వద్ద మరింత మెరుగ్గా పారిశుద్ధ్య నిర్వహణ ఎలా చేపట్టాలనే విషయంపై నిపుణుల సూచనలు స్వీకరించేందుకు ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త జొన్నలగడ్డ శ్రీరామమూర్తి, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సలహాదారుడు డాక్టర్ జయప్రకాష్‌సాయి, గ్రేటర్ విశాఖపట్నం కార్పొరేషన్ అదనపు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన జేఎస్ఆర్ అన్నమయ్య, సింగపూర్‌లోని ప్లానెట్‌వైజ్ సంస్థ వ్యవస్థాపకుడు కె.అనిల్‌కుమార్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ పి.రవి పాల్గొని ప్రసంగించారు. మెరుగ్గా పారిశుధ్య విధులు నిర్వహించిన 12 మంది కార్మికులను జేఈవో ఘనంగా సన్మానించి బహుమతులు అందజేశారు. టీటీడీ ఎస్ఈ–2 జగదీశ్వర్‌రెడ్డి, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రీదేవి, శ్వేత డైరెక్టర్ ప్రశాంతి, అదనపు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంపూర్ణ ఉచిత వైద్యం



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న మేయర్ శిరీష

– నగర మేయర్ డాక్టర్ శిరీష

తిరుపతి తుడా: ప్రతి కుటుంబానికి సంపూర్ణ ఉచిత వైద్యం అందించాలన్నదే జగనన్న ఉద్దేశమని నగర మేయర్ డాక్టర్ శిరీష తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని నెహ్రూ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోందని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుంటున్నారని, ఉచిత వైద్యం, ఉచితంగా మందులు తీసుకుంటూ ప్రతి ఒక్కరు సంతృప్తి చెందుతున్నారని తెలిపారు.

ఇంటి వద్ద నుండి రాలేని వారి కోసం ప్రత్యేకంగా వలంటీర్ల ద్వారా, సచివాలయ సిబ్బంది ద్వారా తెలియజేస్తే ఇంటి వద్దకే వైద్యులు వచ్చి వైద్యం అందిస్తారని తెలియజేశారు. ప్రజలకు ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బసవ గీత, వైఎస్ఆర్ సీపీ నాయకులు బాలసుబ్రమణ్యం, వైద్యులు, ఏఎస్ఎంలు పాల్గొన్నారు.

ఓటమి భయంతో టీడీపీ కుట్ర రాజకీయాలు



మాట్లాడుతున్న వైఎస్ఆర్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారపు మధు

తిరుపతి కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ఓటమి భయంతో టీడీపీ నేతలు కుల చిచ్చు, రాజకీయ కుట్రలకు పాల్పడుతూ సీఎం జగన్‌పై, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అసత్యపు విమర్శలు చేస్తున్నారని వైఎస్ఆర్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారపు మధు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం ఆర్ అండ్ బీ అతిథి గృహం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పుంగనూరు ఘటనలో ప్రధాన నిందితుడైన టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ముల్లంగి వెంకటరమణను అడ్డుపెట్టుకొని టీడీపీ నేతలు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ నిందారోపణలకు పాల్పడడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిపై దాడి చేయడాన్ని మంత్రి పెద్దిరెడ్డికి ఆపాదిస్తూ విమర్శలు చేయడం దుర్మార్గమన్నారు. రాజకీయ కుట్రలతో ప్రభుత్వంపై, మంత్రి పెద్దిరెడ్డిపై టీడీపీ విమర్శలు చేస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. వైఎస్ఆర్ సీపీ గిరిజన నేత మూడే హరిచౌహాన్ నాయక్, బీసీ నేతలు నాగేంద్ర, రాజశేఖర్ పాల్గొన్నారు.

అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లిన కారు



కాలువలోకి దూసుకెళ్లిన కారు

చంద్రగిరి: అదుపుతప్పి కాలువలోకి కారు దూసుకెళ్లిన ఘటన సోమవారం పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి కోట సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు చిత్తూరు నుంచి తిరుపతి వైపు ఎంజీ కారు వస్తోంది. చంద్రగిరి సమీపంలోని కోట వద్ద వస్తున్న క్రమంలో కారు అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. దీంతో కారులోని డ్రైవరు షణ్ముగంకు స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం సమాచారం అందుకున్న పోలీసులు జేసీబీ సాయంతో కారును పక్కకు తీశారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

సంకల్ప యాత్రతో సీఎం జగన్ సంక్షేమ పాలన



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: ప్రజా సంకల్ప యాత్ర ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా పరిశీలించి, అధికారంలోకి వచ్చాక వారి సంక్షేమానికి నిరంతరం కృషిచేస్తూ అందరికీ ఆర్థిక భరోసా కల్పిస్తున్న ఆదర్శవంతమైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. వైఎస్ జగన్ ప్రజా సంకల్ప యాత్ర చేపట్టి ఆరేళ్లు పూర్తి అయిన సందర్భంగా ఎమ్మెల్సీ కార్యాలయంలో ఆయన కేక్ కట్ చేసి సంబరాలు చేపట్టారు.

విశ్వకర్మ యోజనకు దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న తిరుపతి రూరల్ ఎంపీడీఓ రమేష్‌బాబు

తిరుపతి రూరల్: చేతివృత్తులను ప్రోత్సాహించేందుకు, గ్రామీణ పేదలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి రూరల్ ఎంపీడీఓ రమేష్‌బాబు కోరారు. రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 18 ఏళ్ల కంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు, పూర్వీకుల నుంచి కుటుంబ వృత్తిగా చేస్తున్న హస్త కళాకారులు ఈ పథకానికి అర్హులన్నారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే అర్హత ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఐడీ కార్డు, శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ కూడా అందిస్తామన్నారు. వ్యాపారాభివృద్ధికి మొదటి విడతలో రూ.లక్ష, రెండో విడతలో రూ.2 లక్షల వరకు రుణాలు అందిస్తామన్నారు. రూ.15 వేల వరకు పనిముట్లు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఇంకా చివరి తేదీని ప్రభుత్వం ప్రకటించలేదని, అర్హులైన వారు ఆయా సచివాలయాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

మహా పడావోకు తరలిరండి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

తిరుపతి కల్చరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 27, 28వ తేదీల్లో విజయవాడలోని రాజ్ భవన్ వద్ద నిర్వహించే మహా పడావో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మిక, కర్షక సంఘాల నేతలు పిలుపు నిచ్చారు. గంధమనేని శివయ్య భవన్‌లో సోమవారం ఏఐటీయూసీ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలపై జిల్లాలో చేపట్టాల్సిన ప్రచార కార్యక్రమాల సన్నాహక సదస్సు నిర్వహించారు. ఏఐటీయూసీ, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగసుబ్బారెడ్డి, ఓబుల్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, రైతు కూలీ సంఘం నేత వెంకటరత్నం మాట్లాడారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, ఎన్‌డీ రవి, శ్రీరాములు, రైతు సంఘం అధ్యక్షుడు జనార్దన్, హేమలత, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తులసీరాజన్, వీవీ రమణయ్య, ఆర్.వెంకయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన ఎస్వీసీసీ విద్యార్థులు



బుజ్జి దీపిక తేజశ్రీ

తిరుపతి సిటీ: ఎస్వీయూ విడుదల చేసిన మొదటి సంవత్సరం డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక బాలాజీ కాలనీలోని ఎస్వీసీసీ విద్యార్థులు డిస్టింక్షన్లు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ఆ కళాశాల ప్రిన్సిపల్ నాగరాజ సోమవారం తెలిపారు. బీకాం కంప్యూటర్స్‌లో బుజ్జి 7.69, దీపిక 7.57, తేజశ్రీ 7.54 శాతం మార్కులు సాధించారని తెలియజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



అర్జీలు స్వీకరిస్తున్న కమిషన్ హరిత

తిరుపతి తుడా: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు ఎవరికి వారు వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత పిలుపునిచ్చారు. కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను నిర్వహించారు. డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణతోపాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని డివిజన్లలో ఫాగింగ్, బ్లీచింగ్ చల్లాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, ఎస్ఈ మోహన్, సెక్రటరీ రాధిక, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, ఏసీపీ బాలసుబ్రమణ్యం, రెవెన్యూ ఆఫీసర్లు సేతుమాధవ్, కేఎల్ వర్మ, మేనేజర్ చిట్టిబాబు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పెళ్లికానుక అందజేత



వధువు పావనికి పెళ్లికానుక అందజేస్తున్న ఉప సర్పంచ్ అశోక్‌రెడ్డి, అధ్యక్షుడు మహ్మద్‌కాసీమ్

తిరుపతి మంగళం: చంద్రగిరి నియోజకవర్గంలో నివాసం ఉంటూ వివాహం చేసుకుంటున్న నూతన వధూవరులకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్, ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పెళ్లి కానుక పంపడం ఆనవాయితీ. ఇందులో భాగంగా మంగళం సప్తగిరి నగర్ గ్రామ పంచాయతీలోని అంబేద్కర్‌కాలనీకి చెందిన నూతన వధువు కె.పావనికి పెళ్లికానుకను వైఎస్ఆర్ సీపీ నాయకులు అందజేశారు. బంగారు తాళిబొట్టు, పసుపు, కుంకుమ, వెండి మెట్టెలు, పట్టువస్త్రాలు, శ్రీవారి ప్రసాదంతోపాటు ఎమ్మెల్యే ఆశీస్సులతో కూడిన గ్రీటింగ్‌కార్డ్‌ను ఆ పంచాయతీ ఉపసర్పంచ్ అశోక్ రెడ్డి, అధ్యక్షుడు మహ్మద్‌కాసీమ్ బాషా, వార్డు మెంబర్లు మురుగేష్, నాయకులు భాస్కర్‌రెడ్డి, దేవరాజులు, రామాంజులురెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా రామమూర్తి



రాష్ట్ర అధ్యక్షుడు రామమూర్తి

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా తిరుపతి జిల్లాకు చెందిన కొత్తకోట రామమూర్తి నియమితులయ్యారు. ఆదివారం విశాఖలో జరిగిన ఏపీ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యయ సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక వర్గ సమావేశంలో ఈయనను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రామమూర్తిని ఆ సంఘం తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి పీ.మునిరత్నం, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర, దామోదరం, జగదీష్, వెంకటస్వామి అభినందించారు.

ఆన్‌లైన్‌లోనే వ్యాపార చలానాలు



మాట్లాడుతున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు మద్దిలేటి, జగదీష్, నర్మద

తిరుపతి అర్బన్: వ్యాపారులు తాము వ్యాపారం చేసుకోవడానికి రిజిస్ట్రేషన్లు, లైసెన్స్‌లు పొందడానికి ఎవరికీ పైసా ఇవ్వాల్సిన పనిలేదని అంతా ఆన్‌లైన్ ద్వారా చలానాలు కట్టుకునే సౌకర్యం ఉందని ఆహార భద్రతా శాఖ జిల్లా అధికారులు మద్దిలేటి, జగదీష్, నర్మద వెల్లడించారు. కలెక్టరేట్‌లోని తమ కార్యాలయం నుంచి వారు సోమవారం మాట్లాడుతూ రూ.12 లక్షలకు తక్కువ వ్యాపారం చేస్తున్నవారు రిజిస్ట్రేషన్ చేయించుకుంటే సరిపోతుందని చెప్పారు. రూ.12 లక్షల కంటే ఎక్కువ వ్యాపారం చేస్తున్న వారు మాత్రమే ఆహార భద్రతా శాఖ నుంచి లైసెన్స్‌లు పొందాల్సి ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి సంబంధించి కేవలం gorcor.frrai.gov.in వెబ్‌సైట్ మాత్రమే ఉందని తెలిపారు. పలు నకిలీ వైబ్‌సైట్‌లు వస్తున్నాయని, వాటిని నమ్మరాదని స్పష్టం చేశారు. కొందరు తాము ఆహార భద్రతాశాఖ నుంచి వచ్చామని, ఫుడ్ సేఫ్టీ అధికారులు అంటున్నారని సమాచారం ఉందన్నారు. వారిని ముందుగా ఐడీ కార్డులు చూపాలని కోరాలని తెలిపారు. ఆహార భద్రతా శాఖకు సంబంధించిన dfsotpt@fmai.com కు సమాచారం ఇవ్వాలని వారు వెల్లడించారు.


అత్యవసర విభాగంలో విస్తృత సేవలు



ఎమర్జెన్సీ విభాగం వద్ద సిద్ధంగా ఉంచిన స్ట్రెచర్లు, వీల్ చైర్లు

తిరుపతి తుడా: స్విమ్స్ అత్యవసర విభాగం గాడిన పడుతోంది. అత్యవసర వైద్య సేవలకు వచ్చే రోగులందరికీ అత్యుత్తమ వైద్యాన్ని అందించే దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా అధికారులు ఆస్పత్రికి వచ్చే రోగులను వెంటనే అత్యవసర విభాగంలోకి తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. అంబులెన్స్ వచ్చి ఆగిన వెంటనే రోగిని తరలించేందుకు అవసరమైన రెండు స్ట్రెచర్లు, రెండు వీల్ చైర్లు, ఇందుకో అవసరమైన సిబ్బందిని సోమవారం నుంచి అందుబాటులో ఉంచారు. స్విమ్స్ ఆస్పత్రి ప్రత్యేక అధికారి డాక్టర్ రాచపల్లి రెడ్డెప్ప రెడ్డి ప్రిన్స్ అత్యవసర విభాగానికి చికిత్స చేస్తున్నారు. గతంలో 60 శాతం మంది బాధితులను బెడ్లు లేవు అంటూ వెనక్కి పంపించే పరిస్థితులు ఉండేవి. ప్రస్తుతం ఆ విధానానికి చెక్ పెట్టి అవసరమైన అందరికీ అత్యవసర విభాగంలో చికిత్స అందించేందుకు పక్కా ప్రణాళికలను అమలు చేస్తున్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



తిరుమల శ్రీవారి ఆలయం ఎదుట సీనియర్ ఐఏఎస్ అధికారి శ్రీనివాసరాజు, సినీనటి వాణిశ్రీ

తిరుమల: తిరుమల శ్రీవారిని సోమవారం సీనియర్ ఐఏఎస్ అధికారి శ్రీనివాసరాజు, సినీనటి వాణిశ్రీ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

స్విమ్స్‌లో 'కంటి శుక్లాలు' ఆపరేషన్లు

తిరుపతి తుడా: 'జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో పలువురికి కంటి సంబంధిత వ్యాధులను గుర్తించారు. కంటి శుక్లాలు ఆపరేషన్లు అవసరమైన వారిని స్విమ్స్ శ్రీపద్మావతి ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు చేశారు..' అని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం కంటి శుక్లాలు ఆపరేషన్లు చేసుకున్న రోగులను పరామర్శించారు. ఆస్పత్రిలో వారికి అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ వెంకటాచలం, భావన వెంకటాచలం, స్విమ్స్ ఆప్తమాలజీ వైద్య బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ అనస్థీషియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మధుసూదన్, ఆప్తమాలజీ వైద్యులు శ్రీలలిత, శ్రీవిద్య, సింధూర, వినీత పాల్గొన్నారు.

వైభవంగా శ్రీదేశమ్మ ఆలయ వార్షికోత్సవం



విశేష అలంకరణలో శ్రీదేశమ్మ అమ్మవారు

చంద్రగిరి: కొత్తపేటలోని శ్రీదేశమ్మ దేవాలయంలో 31వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త రాగూరు చంద్రశేఖర్ తెలిపారు. శ్రీదేశమ్మ దేవాలయం వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. 31వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించి, బంగారు ఆభరణాలు, సుగంధ భరిత పుష్పాలతో అమ్మవారికి విశేషాలంకరణ చేపట్టారు. వార్షికోత్సవ వేడుకలకు ఉభయదారులుగా ఎం.నారాయణ, ఏనుగుల పోతన, రాగూరు నటరాజ, రాగూరు నిత్యానందం, ఆర్.బాలకోటి, కోలా మునికృష్ణ, కోలా బుజ్జి, బలరామన్, భువనేశ్వరి, ఏనుగుల గోపాల్ ఉభయ దాతలుగా వ్యవహరించారు. వీరికి పాలకమండలి సభ్యులు తీర్థప్రసాదాలు ఇచ్చి సత్కరించారు.

నేటి నుంచి విజేతలకు బహుమతులు



మాట్లాడుతున్న డీపీటీవో చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: ఆర్టీసీ కార్గో మాసోత్సవాల్లో భాగంగా ప్రతి మంగళవారం పార్శిల్ చేసిన వారికి లక్కీడిప్ ద్వారా విజేతలను ఎంపిక చేస్తామని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన హైర్ బస్సుల యజమానులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్గో వ్యాపారాన్ని విస్తరించడానికి పలు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. వ్యాపారులను ప్రోత్సహించడానికి మాసోత్సవాల్లో సీఎంఆర్ షాపింగ్ మాల్ వారి ఆర్థిక సాయంలో బహుమతులను అందజేస్తామని వెల్లడించారు. మరోవైపు నూతనంగా నిర్మించిన శ్రీనివాస సేతుపై కొందరు రాంగ్ రూట్‌లో వెళుతున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్గో జిల్లా ఇన్‌చార్జి సురేంద్రబాబు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీ వితరణ



కుర్చీని అందజేస్తున్న పాఠశాల కమిటీ సభ్యులు

పాకాల: మండలంలోని అచ్చమ్మ అగ్రహారం ఎంపీపీ పాఠశాలకు తల్లిదండ్రుల కమిటీ సభ్యులు రూ.9 వేలు విలువ చేసే కుర్చీని వితరణ చేశారు. సోమవారం స్థానిక పాఠశాలలో తల్లిదండ్రులతో కమిటీ సమావేశం చైర్మన్ శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా అనేక రకాల మౌలిక సదుపాయాలను కల్పించారని, హెచ్ఎం, ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేసి పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చారని కొనియాడారు. అనంతరం పాఠశాల హెచ్ఎం జార్జి మాట్లాడుతూ పాఠశాలకు కుర్చీని వితరణ చేసిన కమిటీ సభ్యులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవీన్‌కుమార్, జవహర్, విమల, రజినిప్రియ, జయంతి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.